# క్రీడాపోటీల్లో విద్యార్థుల ప్రతిభ



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన సుద్దులం విద్యార్థులతో ఉపాధ్యాయులు

కోటగిరి(పోతంగల్)/ డిచ్‌పల్లి/ ఖలీల్‌వాడి, నవంబర్ 7:కోటగిరి మండలంలోని తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాలకు చెందిన ఎం.రాహుల్ ఎస్జీఎఫ్ అండర్ – 17 ఖోఖో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం మమ్మద్ అబ్దుల్ ఖలీక్, పీఈటీ సాయికుమార్ గురువారం తెలిపారు. ఈనెల 15 నుంచి 17 వరకు వికారాబాద్ జిల్లాలోని తాండూర్ మండలంలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో రాహుల్ పాల్గొననున్నట్లు తెలిపారు. సుద్దులం జడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులు రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు మెండే రమేశ్ గురువారం తెలిపారు. ఇటీవల మిట్టాపల్లిలో నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభ చూపిన భావన, రిషికా రెడ్డి, మిమనీత, హర్షిత్, రాంరెడ్డి త్వరలో నిర్మల్‌లో నిర్వహంహినున్న అండర్–16 బాలబాలికల పోటీల్లో జిల్లా జట్టు తరపున ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. విద్యార్థులను ప్రధానోపాధ్యాయుడు బి.గంగారాం, ఉపాధ్యాయులు అభినందించారు. రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు విజయ్ హైస్కూల్‌కు చెందిన శివదత్త, అక్షిత, హరిణి, ఆరాధ్య ఎంపికైనట్లు కరస్పాండెంట్ ప్రభాదేవి తెలిపారు. ఇటీవల వెల్పూర్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో పాఠశాలకు చెందిన తనూష్, శివదత్త, చంద్రాన్ష్, అనీష్, నయన్, సాయిసూర్యాన్ష్ రజత పతకాలు, బి.అక్షిత, మనస్విని, పి.హరిణి, పి.ఆరాధ్య కాంస్య పతకాలు సాధించినట్లు తెలిపారు. విద్యార్థులను పాఠశాల కార్యదర్శి డాక్టర్ అమృత లత అభినందించారు. మెపాల్ శివారులోని ప్రెసిడెన్సీ పాఠశాలకు చెందిన సాత్విక్‌రెడ్డి, భవిక్ జాతీయ స్థాయి సెపక్ తక్రా పోటీలకు ఎంపికయ్యారు. హైదరాబాద్‌లో ఇటీవల నిర్వహించిన పోటీల్లో వారు ప్రతిభ చూపి జాతీయ స్థాయికి ఎంపికయ్యారని తెలిపారు. పాఠశాల చైర్మన్ శమంత, హెచ్‌ఎం పవన్‌కుమార్, పీఈటీలు శ్రీనివాస్, లక్ష్మణ్, జ్యోతి అభినందించారు.

## కెనాల్‌లో పూడికతీత

చందూర్, నవంబర్ 7: చందూర్‌లోని 38/అ కెనాల్‌లో పూడికతీత పనులు గురువారం చేపట్టారు. కాలువలో చెత్తాచెదారం చేరడంతో జేసీబీ సహాయంతో తొలగించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సాయారెడ్డి, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

## దైవభక్తిని కలిగించేది 'భగవద్గీత'

సుభాష్‌నగర్, నవంబర్ 7: ఏకాగ్రతను పెంచి దేశ, దైవ భక్తిని కలిగించేది భగవద్గీత అని ప్రముఖ ధార్మికవేత్త కృష్ణకుమార్ అన్నారు. నగరంలోని వీఎన్ఆర్ పాఠశాలలో జిల్లాస్థాయి గీతా శ్లోకాల పోటీలను గురువారం నిర్వహించారు. 17వ అధ్యాయంలోని 28 శ్లోకాలను 50మంది విద్యార్థులు పఠించారు. యాదేశ్‌గౌడ్, విజయలక్ష్మి, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

## వృద్ధురాలి అదృశ్యం

రుద్రూర్, నవంబర్ 7: మండలంలోని చిక్కడ్‌పల్లి గ్రామానికి చెందిన మచ్చూరి ఎల్లవ్వ అక్టోబర్ 14న ఇంటి నుంచి వెళ్లి తిరిగిరాలేదు. కుటుంబ సభ్యులు వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో ఎల్లవ్వ కుమారుడు నగేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సాయన్న తెలిపారు.























